క్లుప్తంగా

నూర్ మసీదు నిర్మాణానికి ఎమ్మెల్యే ఆర్కే సాయం



మంగళగిరి: నగర పరిధిలోని రాజీవ్ గృహకల్ప వద్ద ఉన్న పావురాల కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న నూర్ మస్జీదు నిర్మాణానికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) రూ.లక్ష ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. శుక్రవారం వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ అన్నపురెడ్డి బ్రహ్మారెడ్డి చేతుల మీదుగా మస్జీదు కమిటీ నిర్వాహకులకు అందజేశారు. కాగా మస్జీదు నిర్మాణానికి రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందించిన ఎమ్మెల్యే ఆర్కేకు కమిటీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

పరిశుద్ధ హృదయంతో జీవించాలి



ఫిరంగిపురం: ప్రతి ఒక్కరూ పరిశుద్ధ హృదయంతో జీవించాలని బాల ఏసుదేవాలయ విచారణ గురువు పామిశెట్టి బాలస్వామి అన్నారు. మండల కేంద్రంలోని బాల ఏసుదేవాలయంలో తపస్సుకాల శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు, దివ్యసత్ప్రసాద ఆరాధన, శ్లీవమార్గం, 14 స్థలాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈసందర్భంగా బాలస్వామి వాక్యోపదేశం చేస్తూ క్రీస్తు పరలోకం నుండి భూలోకానికి వచ్చి జీవాన్ని అందించాడన్నారు. ప్రతి మానవుడు తపస్సుకాలంలో పాపపంకిలాలను వొదిలివేయాలని చెప్పారు. సాయంత్రం ప్రత్యేక దివ్యపూజా బలి నిర్వహించి 14 స్థలాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

వైభవంగా కోదండ రామస్వామి మహాక్రతు ప్రతిష్ఠా మహోత్సవం



తాడికొండ: గ్రామంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో నూతనంగా నిర్మించి రామచంద్ర స్వామి రామకోటి మహాక్రతు ప్రతిష్ఠా మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం స్వామి కల్యాణం భక్తజన సందోహం నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వయంగా రాసిన రామకోటి ప్రతులను రామ స్థూపంలో ప్రతిష్ఠించి స్వామి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆర్థిక సాయం



తాడేపల్లి రూరల్: దుగ్గిరాల గ్రామంలోని ఆర్ఎంపీ షేక్ గౌస్ కుటుంబానికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) అందించిన రూ.50వేల ఆర్థిక సాయాన్ని ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, వైఎస్సార్‌సీపీ నాయకులు దానబోయిన వెంకటేశ్వరరావు(డీవీఆర్) శుక్రవారం అందజేశారు. గౌస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దుగ్గిరాల-3 ఎంపీటీసీ సభ్యురాలు పెద్దేటి కావ్య చికిత్సకు రూ.50 వేలు సాయం అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కంభంపాటి క్రాంతికుమార్, బచ్చా రఘునాథ్ యాదవ్, షేక్ సుభాని, బి.వి. నాయక్, పఠాన్ బుడే, అబ్దుల్, మైలా గంగా యాదవ్, తోడేటి జాన్సన్, బుజ్జిబాబు పాల్గొన్నారు.

తొమ్మిది మొబైల్ ఫోన్లు అప్పగింత

నగరంపాలెం: మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న బాధితుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన గుంటూరు పోలీస్ వాట్సాప్ నంబర్ నిరంతరం అందుబాటులో ఉంటుందని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ తెలిపారు. జిల్లాలోని మరో తొమ్మిది మందికి పోగొట్టుకున్న ఫోన్లను శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఆయన అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడేళ్ల కిందట పోయిన ఫోన్లను కూడా అప్పగించడంతో బాధితులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. వాట్సాప్ 8688831574 నంబర్‌ను బాధితులు ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. ఫోన్లను గుర్తించడంలో ప్రతిభ చాటుతున్న ఐటీ కోర్ ఇన్‌చార్జి ఎస్‌ఐ డి.వెంకటకృష్ణ, కానిస్టేబుళ్లు రమేష్, కరీముల్లా, శ్రీధర్‌ను అభినందించి ప్రశంస పత్రాల్ని అందించారు. కార్యక్రమంలో ఏఎస్పీ(పరిపాలన) కె. సుప్రజ, ఎస్బీ సీఐ బి.నరసింహారావు పాల్గొన్నారు.

ఉండవల్లికి కృష్ణాజలాలు అందించేందుకు ప్రణాళిక

కొత్త పైపులైన్ల నిర్మాణానికి ఏర్పాట్లు



ఉండవల్లి అమరావతి రోడ్‌లో గుంటూరు చానల్ పక్కన ఏర్పాటు చేసిన ప్రెజర్ శాండ్ ఫిల్టర్

తాడేపల్లి రూరల్: ఉండవల్లి త్వరలో కృష్ణా జలాలు అందనున్నాయి. అందుకు అనుగుణంగా పైపులైన్ పనులు సాగుతున్నాయి. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ఉండవల్లి పర్యటించిన సందర్భంలో బోరు వాటర్ సరిగా లేదని, మా ప్రాంతానికి కృష్ణా జలాలు అందించాలని ప్రజలు విన్నవించారు. స్పందించిన ఆయన కార్పొరేషన్ అధికారులతో మాట్లాడి ఉండవల్లికి కృష్ణాజలాలు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. గుంటూరుకు కృష్ణానది నుంచి నీటిని సరఫరా చేసే అండర్ గ్రౌండ్ టన్నెల్ నుంచి తాగునీటిని తీసుకుని ప్రెజర్ శాండ్ ఫిల్టర్ ద్వారా నీటిని శుద్ధి చేసి ప్రజలకు అందించవచ్చని అధికారులు సూచించారు. ఉండవల్లి జనాభా 15 వేలు దాటడంతో 9 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన ప్రెజర్ శాండ్ ఫిల్టర్ ఏర్పాటు చేయాలని డీఈ కృష్ణారెడ్డి నివేదిక అందజేశారు. స్పందించిన ఆర్కే నెల రోజుల వ్యవధిలో ప్రస్తుతం 6 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన 4 ప్రెజర్ శాండ్ ఫిల్టర్లను ఏర్పాటు చేశారు. ఉండవల్లి సెంటర్ బాపనయ్య నగర్, సాయినగర్, కరకట్ట,పాత ఉండవల్లి, ఎస్టీ కాలనీ తదితర ప్రాంతాల్లో మూడు ప్రాంతాలకు ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల ద్వారా మరో మూడు ప్రాంతాలకు డైరెక్ట్ పంపింగ్ ద్వారా కృష్ణాజలాలు అందిస్తున్నారు.

కొత్త లైన్లకు ప్రతిపాదన

ఉండవల్లి ప్రాంతం 9 కి.మీ. పరిధిలో విస్తరించి ఉండడంతో ప్రతి ప్రాంతంలో కార్పొరేషన్ అధికారులు కొత్త పైపులైన్లు వేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. విజయవాడకు అతి సమీపంలో ఉండడంతో ఎంతోమంది వ్యాపారస్తులు, ఉద్యోగస్తులు ఉండవల్లి ప్రాంతంలో ఇంటి నిర్మాణాలు చేపట్టారు. పెరుగుతున్న జనాభాకు, ప్రాంతాలకు సరిపడా తాగునీటిని అందించేందుకు సచివాలయం ఇంజినీరింగ్ సిబ్బంది ప్రణాళిక సిద్ధం చేశారు. ఉండవల్లి పరిధిలో ప్రతి ప్రాంతానికి తాగునీటిని సరఫరా చేయాలంటే మరో నాలుగున్నర కి.మీ. మేర పైపులైన్లు ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ సిబ్బంది కార్పొరేషన్ అధికారులకు నివేదికలు అందించారు. త్వరలోనే అన్ని ప్రాంతాలకు కొత్త పైపులైన్లు వేసి నీటిని అందిస్తామని, ప్రస్తుతం జామాయిల్ తోట, పాత జాతీయ రహదారి వెంబడి పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు డీఈ కృష్ణారెడ్డి తెలిపారు. ఎట్టకేలకు ఉండవల్లి ప్రాంత వాసులకు ఎమ్మెల్యే ఆర్కే సహకారంతో తాగునీరు అందనుండడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అధునాతన టెక్నాలజీతో ఫిల్టర్ బెడ్‌లు

అధునాత టెక్నాలజీతో ఉండవల్లిలో 6 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన నాలుగు ప్రెజర్ శాండ్ ఫిల్టర్ బెడ్‌లను ఏర్పాటు చేశారు. ప్రతి 4 గంటలకు ఒకసారి ప్రెజర్ ఫిల్టర్ బెడ్‌లను రివర్స్ పద్ధతిలో క్లీనింగ్ చేసే విధంగా రూపొందించారు. ప్రతిరోజూ రెండుసార్లు క్లీనింగ్ చేస్తున్నట్లు కార్పొరేషన్ అధికారులు చెబుతున్నారు. ఈ నీటిని తాగేందుకు ఉపయోగించుకోవచ్చని అధికారులు అంటున్నారు.

అభివృద్ధి పనులు పరిశీలించిన ఎమ్మెల్యే ఆర్కే



మగ్గం షెడ్ల పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

మంగళగిరి: నగరంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) శుక్రవారం రాత్రి పరిశీలించారు. నగరంలోని రాజీవ్ గృహకల్ప వద్ద రాత్రి వేళలో జరుగుతున్న చేనేత మగ్గం షెడ్ల నిర్మాణ పనులను పరిశీలించి నాణ్యతలో రాజీపడకుండా పనులను వేగవంతం చేయాలన్నారు. అధికారులు, సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం ఆత్మకూరు గుంటూరు చానల్ వద్ద తాగునీటి పథకం ఆవరణలో పంపు హౌస్, స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ రింక్ నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ అన్నపురెడ్డి బ్రహ్మారెడ్డి, తాడేపల్లి మండల యూత్ కన్వీనర్ మున్నంగి వివేకానందరెడ్డి, నగరపాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లో పేలిన బ్రేకర్

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సిమెంట్ ఫ్యాక్టరీలోని 11 కేవీ విద్యుత్ స్టేషన్‌లో శుక్రవారం తెల్లవారుజామున ఓ ప్రాంతానికి వెళ్లే విద్యుత్ నియంత్రణ బ్రేకర్లు పేలిపోవడంతో ఒక్కసారిగా సబ్‌స్టేషన్‌లో మంటలు చెలరేగాయి. వెంటనే అప్రమత్తమైన నులకపేట సబ్‌స్టేషన్ ఏ.ఇ. షణ్ముఖ తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నాలు చేశారు. సుమారు గంట పాటు మంటలను అదుపు చేసేందుకు ఇసుక, అగ్ని నియంత్రణ వాయువును ఉపయోగించి మంటలను అదుపు చేసి వేరే నియంత్రణ బ్రేకర్ ద్వారా పునరుద్ధరించారు. శుక్రవారం ఉదయం గంట పాటు విద్యుత్‌ను నిలిపివేసి గుంటూరు నుండి వచ్చిన ప్రత్యేకబృందాలు సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తులు నిర్వహించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ఉచిత వైద్య శిబిరం

మంగళగిరి: స్థానిక శ్రీరామానగర్ ఏపీఎస్పీ పెన్షనర్ అసోసియేషన్ పదో వార్షికోత్సవం సందర్భంగా ఉచిత వైద్యశిబిరం శుక్రవారం నిర్వహించారు. స్థానిక కార్యాలయంలో విజయవాడ సెంటినీ ఆస్పత్రి సౌజన్యంతో గుండె వ్యాధుల శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని అసోసియేషన్ అధ్యక్షులు తాటి కృష్ణారావు నాయుడు ప్రారంభించారు. శిబిరంలో డాక్టర్ హరీష్ బీపీ, షుగరు, ఈసీజీ తదితర పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోవర్ధన్, నాయకులు తోట సాంబశివరావు, పావనరావు, ఎమ్మెస్కే శ్రీధర్, భాస్కరరెడ్డి, గుడిపాటి చిన్న తిరుపతి నాయుడు, బాలకృష్ణ, డి మోహనరావు పాల్గొన్నారు.

పుట్టుకతో వచ్చే లోపాలను గుర్తించాలి

ఫిరంగిపురం: చిన్నారుల ఎదుగుదల సమయంలో పుట్టుకతో ఉండే లోపాలను ఆరోగ్య సిబ్బంది గుర్తించాలని నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి ఫరీనాబేగం అన్నారు. మండలంలోని వేములూరిపాడు సచివాలయం వద్ద శుక్రవారం ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా 104 వాహన వైద్యులతో ఆరోగ్యశిబిరం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు పరీక్షలు నిర్వహించారు. సాధారణ వ్యాధులతో ఉన్న 102 మందికి రక్త, మూత్ర పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు. మధ్యాహ్నం అంగన్‌వాడీ సెంటర్లలోని చిన్నారులకు పరీక్షలు చేశారు. ఈసందర్భంగా ఫరీనాబేగం మాట్లాడుతూ పిల్లల ఎదుగుదలలో లోపం, పోషకాహారంలోపం, పెరుగుదల లేకపోవడం, గ్రహణం మొర్రి వంటి వాటిని ఆరోగ్యసిబ్బంది గుర్తించి తెలియజేయాలని చెప్పారు. ప్రతివారంలో సోమ, గురువారాల్లో రక్తహీనత లేకుండా ఆరు నెలల నుండి ఐదేళ్ల లోపు పిల్లలకు ఐరన్‌సిర్రోజ్ సిరప్‌ను వాడుతున్న వివరాలు అంగన్‌వాడీ సిబ్బందిని అడిగి తెలుసున్నారు. ఆమె వెంట 104 వైద్యుడు మేదారవికుమార్, ఎంఎల్‌హెచ్‌పీ స్వప్న, ఏఎన్ఎం అంతోనిరాణి, డీఈఓ విజయ్, సింగరాజు, ఆశ కార్యకర్తలు శాంతరాణి, సుజాత, శాంతకుమారి, పద్మ పాల్గొన్నారు.

నీటి పన్నులు వసూలు చేయాలి

తాడేపల్లి రూరల్: నగరపాలక సంస్థ పరిధిలో పెండింగ్‌లో ఉన్న నీటి పన్నులను సత్వరమే వసూలు చేయాలని ఆర్‌ఓ మురళి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 31వ తేదీతో 2022-23 ఆర్థిక సంవత్సరం ముగియనుండడంతో వార్డు ఎమినిటీస్ సెక్రటరీలు అందరూ వార్డు సచివాలయ పరిధిలో పెండింగ్‌లో వున్న నీటి పన్నులను ఇంటింటికి తిరిగి వసూలు చేయాలని ఆర్‌ఓ. మురళి కోరారు.

బీజేపీని ఓడించేందుకే భారత్ బచావో ఆవిర్భావం

ఏపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ భాస్కరరావు



భారత్ బచావో జిల్లా సదస్సు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఏపీ కమిటీ ప్రతినిధులు

మంగళగిరి: రానున్న ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకే భారత్ బచావో ఆవిర్భవించినట్లు ఏపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ సి.భాస్కరరావు అన్నారు. నగరంలోని ఐబీఎస్ భవన్ ప్రెస్‌క్లబ్‌లో ఈనెల 5వ తేదీన జిల్లా సీపీఐ కార్యాలయంలో నిర్వహించనున్న భారత్ బచావో జిల్లా సదస్సు కర పత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. భాస్కరరావు మాట్లాడుతూ బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ను స్థాపించి దేశంలో తమకు నాలుగు సామాజిక వర్గాలు శత్రువులుగా ప్రకటించిందని గుర్తు చేశారు. వారిలో ముస్లింలు, క్రైస్తవులు, దళితులు ఉన్నారన్నారు. నేడు బీజేపీ ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తూ వారిపై దాడులకు తెగబడుతుందని విమర్శించారు. జేవహెచ్ నాయకులు యూసఫ్ మాట్లాడుతూ బీజేపీ నేతల అవినీతిపై ప్రశ్నిస్తే ఐటీ దాడులు చేయించి కేసులు నమోదు చేయిస్తున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో పాస్టర్ బి.రవి ప్రకాష్, భారత్ బచావో ఏపీ కమిటీ సభ్యులు ఆకునూరి మురళీకృష్ణ, రేఖా కృష్ణార్జునరావు, బి.కొండారెడ్డి, అజీమ్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

తాడికొండ: వైఎస్సార్ సీపీ లాం కమిటీ అధ్యక్షుడు రాయపూడి రవికి పార్టీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ రూ.10 వేలు ఆర్థికసాయం శుక్రవారం అందించారు. ఇటీవల అనారోగ్యంతో శస్త్ర చికిత్స చేయించుకోవడంతో ఆయన్ను పరామర్శించి సాయం అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాడేపల్లి రూరల్: విద్యుత్‌లైన్ల మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ అక్కుల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అమరావతి కరకట్ట నుంచి కృష్ణా కరకట్ట వెంబడి కొండవీటి వాగు ఎత్తిపోతల పథకం వరకు సరఫరా నిలిపివేస్తున్నామని చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అంగరంగ వైభవంగా కలశ ప్రతిష్ఠ మహోత్సవాలు



కలశ ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొన్న భక్తులు



విగ్రహాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో 24వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం వేదమంత్రాల నడుమ మేళతాళాలతో ప్రధాన ప్రాకార గోపుర దివ్య కలశ ప్రతిష్ఠ అత్యంత వైభవంగా జరిగింది. తొలుత కలశాలకు క్షీరాభిషేకం చేశారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం మేళతాళాలతో క్రేన్ సహాయంతో గోపురంపై భాగానికి చేర్చారు. ఆలయ ప్రధాన పూజారి మాధవాచారి ఆధ్వర్యంలో కలశ ప్రతిష్ఠ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ద్వారపాలకుల విగ్రహాలు, గరుడాళ్వార్, ఆంజనేయస్వామి విగ్రహాల్ని ఆవిష్కరించి, స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు ఆశీర్వచనం చేశారు. ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య సత్కరించారు. శ్రీ పద్మావతి కల్యాణ మండపం వేదికగా నిత్య పూజలతో పాటు శ్రీ వెంకటేశ్వర మహామంత్ర హోమం నిర్వహించారు. ఆలయ ఉపాధ్యక్షుడు లంక విజయబాబు ఆధ్వర్యంలో పద్మావతి గోదా సమేత శ్రీనివాసుని నగరోత్సవాన్ని శేష వాహనంపై తిరువీధుల్లో కన్నుల పండువగా చేశారు. బ్రహ్మోత్సవ విశేషాల్ని మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, బొల్లేపల్లి సత్యనారాయణ, పూటుకూరి నాగేశ్వరరావు, పుట్టగుంట ప్రభాకరరావు, అచ్యుతరామయ్య, సభ్యులు పాల్గొన్నారు.

రేపు గ్రూప్-2పై ఉచిత అవగాహన సదస్సు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీపీఎస్సీ త్వరలో నిర్వహించనున్న గ్రూప్-2 పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల ప్రయోజనార్థం ఆదివారం ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు 21వ సెంచరీ ఐఏఎస్ అకాడమీ చైర్మన్ పి.కృష్ణప్రదీప్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ అశోక్‌నగర్‌లోని అకాడమీ కార్యాలయంలో ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్న సదస్సులో సీనియర్ అధ్యాపకులు గ్రూప్-2 సిలబస్, ప్రిపరేషన్ స్ట్రాటజీ, నోట్సు మేకింగ్, సమయపాలన తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఉచిత అవగాహన సదస్సును సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు 91332 37733, 040-35052121 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పోగొట్టుకున్న నగదు ఖాతాలో జమ



ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన బాధితురాలు

నగరంపాలెం: యాప్ ద్వారా ఓ ఉద్యోగిని లక్షల్లో మోసపోయింది. ఇక డబ్బులు వచ్చే అవకాశాల్లేవని భావించింది. అయితే గతంలో ఓ మహిళ కూడా పది లక్షల రూపాయలకు మోసపోగా, గుంటూరు సైబర్ క్రైం (ఐటీ కోర్)లో ఫిర్యాదు చేశారు. ఆమె ఖాతాలో జమ చేయించారు. ఇదే విషయాన్ని తెలిసిన వారు బాధితురాలి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆమె ఫిర్యాదు చేయగా, డబ్బులు జమ చేయించారు. గుంటూరు సైబర్ క్రైం (ఐటీ కోర్) పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెనాలిలోని చెంచుపేట వాసి నెలకుర్తి త్రివేణి ప్రభుత్వ ఉద్యోగిని. ఆమె కాటర్పిల్లర్ యాప్‌లో పెట్టుబడులు నిర్వహించేది. ఈ క్రమంలో రెండు నెలలు కిందట రూ.4.75 లక్షలు మోసపోయింది. దీంతో ఆ డబ్బులు వచ్చే అవకాశం లేదని నిర్ణయించుకుంది. ఈలోగా తెలిసిన వారు బాధితురాలికి సైబర్ క్రైంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. దీంతో ఆమె అక్కడ ఫిర్యాదు చేసి, జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ దృష్టికి తీసుకువచ్చారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఐటీ కోర్ ఇన్‌చార్జి ఎస్‌ఐ డి.వెంకటకృష్ణ, ఆయన బృందం ప్రత్యేక దర్యాప్తు చేపట్టారు. బాధితురాలి వద్ద బ్యాంక్ వివరాలను నమోదు చేసుకుని విచారణ వేగవంతం చేశారు. సంబంధిత బ్యాంక్ అధికారులతో సంప్రదింపులు జరిపారు. ఈ క్రమంలో త్రివేణి బ్యాంక్ ఖాతాకు రూ.2,55,200 జమ అయ్యాయి. జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఆమెకు ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ నగదు అందించారు.సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మోసపూరిత యాప్‌ల జోలికి వెళ్లవద్దని సూచించారు. ఎవరైనా బాధితులు ఉన్నట్లయితే ఉచిత నంబర్ 1930కి ఫిర్యాదు చేయాలని తెలిపారు. మోసపూరిత యాప్ ద్వారా డబ్బులు పోగొట్టుకున్న తనకు ఇక వచ్చే అవకాశాల్లేవని అనుకున్న సమయంలో తిరిగి ఖాతాలో జమ చేయించడం ఆనందంగా ఉందని త్రివేణి చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీకి, ఐటీ కోర్ ఎస్‌ఐ, పోలీస్ సిబ్బందికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఐటీ కోర్ ఎస్‌ఐ, పోలీస్ సిబ్బందికి ఎస్పీ ప్రశంస పత్రాల్ని అందించారు.

జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు

ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి

తాడికొండ: జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి సూచించారు. గుంటూరులోని తన కార్యాలయంలో ఉపాధి పనులపై సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజా 2022-23 ఆర్థిక ఏడాదికి నియోజకవర్గంలోని 4 మండలాల్లో 7,30,991 పనిదినాలు కల్పించడం జరిగిందని, ఇందులో 89 కుటుంబాలకు వందరోజుల పూర్తి పనిదినాలు కల్పించామన్నారు. 2023-24 ఏడాదికి 8,53,814 పనిదినాలు కల్పించనున్నట్లు తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల బాలికలు విద్యకు దూరం

- కేఎల్‌ఈఎఫ్ కార్యదర్శి కోనేరు శివకాంచనలత
- కేఎల్‌యూలో ముగిసిన ఫెమ్ ఫ్లేర్



అతిథులను సత్కరిస్తున్న కేఎల్ ఈఎఫ్ కార్యదర్శి కోనేరు శివకాంచన లత, వాణీమోహన్ తదితరులు

తాడేపల్లి రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో బాలికలు ఎక్కువశాతం ఉన్నత విద్యకు నోచుకోవడం లేదని కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ కార్యదర్శి కోనేరు శివకాంచనలత అన్నారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ఫెమ్ ఫ్లేర్ ముగింపు కార్యక్రమానికి కోనేరు శివకాంచనలత శుక్రవారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏపీ యువజన సర్వీసుల ముఖ్య కార్యదర్శి వాణీమోహన్, డీఐజీ రాజకుమారి గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివకాంచనలత మాట్లాడుతూ భారతదేశంలో నాగరికత పుణ్యమా అని పట్టణ ప్రాంతాల్లో మహిళలు, బాలికలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా పోటీ పడుతున్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో బాలికల విద్యపై వెనుకబాటు తనం కనిపిస్తోందని అన్నారు. సమాజంలో మహిళలకు సమున్నత స్థానం దక్కాలంటే మహిళలు విద్యావంతులు అయితేనే సాధ్యపడుతుందని అన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ పార్థసారథి వర్మ, ప్రొ.చాన్సలర్ డాక్టర్ కేఎస్ జగన్నాథరావు, ప్రొ వీసీ డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ సిహెచ్.హనుమంతరావు, ఫెమ్ ఫ్లేర్ కన్వీనర్లు డాక్టర్ కె.రూతు రమ్య, డాక్టర్ హేమ దివ్య, ఉత్సవ కో కన్వీనర్లు డాక్టర్ ఎ.ప్రియ, డాక్టర్ పి.రాజరాజేశ్వరి, కె.సోని, మహిళా ఫోరం కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.పూజిత, డాక్టర్ శ్రీకావ్య, వి.సాహితి పాల్గొన్నారు.

రేపు రాష్ట్రంలోని విశిష్ట బ్రాహ్మణ మహిళలకు సత్కారం



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న పురుషోత్తమశర్మ

తెనాలి: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కుటుంబ బాధ్యతల్లో ఉంటూనే వివిధ రంగాల్లో రాణిస్తున్న రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన బ్రాహ్మణ మహిళలకు 'వనితా నీకు వందనం' పేరుతో సత్కరించనున్నారు. బ్రాహ్మణ పరిషత్ తెనాలి ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీన స్థానిక మూల్పూరు సుబ్రహ్మణ్యశాస్త్రి కల్యాణమండపంలో ఉదయం 9.30 గంటలకు జరిగే సభ బ్రోచర్‌ను శుక్రవారం పరిషత్ కార్యాలయంలో ప్రధాన కార్యదర్శి పోతావఝుల పురుషోత్తమశర్మ ఆవిష్కరించి వివరాలను తెలిపారు. విశాఖపట్టణానికి చెందిన సైకాలజిస్ట్ దుర్వాసుల శర్వాణి ముఖ్యఅతిథిగా, గౌరవఅతిథులుగా ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, దేవదాయశాఖ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్, మామిళ్లపల్లి మృత్యుంజయప్రసాద్ పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన విశిష్ట బ్రాహ్మణ మహిళలు అవధానుల హిమగిరి బాల, త్రిపురారిభట్ల సత్యజ్ఞానప్రసూనాంబ, కుప్పం ప్రసూన, వెల్లాల లలితమ్మ, కస్తూరి ఇందిరాదేవి, తీర్థల స్వర్ణలత, ద్వాదశి సుమతి, వలివేటి ఉమా, భాగవతుల లలితా శారద, దూళిపాళ్ల రాజ్యలక్ష్మి, నీలంరాజు సరోజను సత్కరించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో త్రిపురారిభట్ల దత్తు, వంగల మాధవ, చెన్నాప్రగడ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అకడమిక్ కేలండర్‌ను విధిగా అమలు పర్చాలి



విద్యార్థుల్లోని అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఉర్దూ డీఐ ఖాసీం

గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాలల నిర్వహణలో అత్యంత కీలకమైన అకడమిక్ కేలండర్‌ను విధిగా అమలు పర్చాలని ఉర్దూ డీఐ షేక్ మొహమ్మద్ ఖాసీం ఉపాధ్యాయులకు సూచించారు. లాలాపేట పరిధిలోని నగరపాలకసంస్థ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. పాఠ్యాంశాల వారీగా విద్యార్థుల సామర్థ్యాల్ని పరిశీలించారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు రూపొందించిన పలు నమూనాలను పరిశీలించి వారిని అభినందించారు. జగనన్న గోరుముద్ద ఆహార పదార్థాల్ని రుచి చూసి, సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా పాఠశాల రికార్డులు పక్కాగా నిర్వహించాలని, పాఠ్య ప్రణాళికలు రూపొందించుకుని బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల నోట్ పుస్తకాలు, వర్క్ పుస్తకాల్ని తప్పనిసరిగా పరిశీలించి తగు సూచనలు ఇవ్వాలని ఆదేశించారు.

శ్మశాన వాటికల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి: మేయర్



శ్రీనివాసరావుతోట శ్మశానవాటికలో పనులను పరిశీలిస్తున్న మేయర్

నెహ్రూనగర్: నగరంలోని శ్మశానవాటికల్లో మౌలిక వసతుల కల్పనకు నగరపాలక సంస్థ ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, ఇందులో స్వచ్ఛంద సంస్థల్ని కూడా భాగస్వామ్యం చేస్తామని మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు తెలిపారు. శ్రీనివాసరావుతోటలోని హిందూ శ్మశానవాటికలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ అభివృద్ధి పనుల్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీనివాసరావుతోట శ్మశానవాటికను ఎనిమిదో డివిజన్‌లలోని సుమారు లక్ష మంది ప్రజలు వినియోగిస్తున్న దృష్ట్యా పలు సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆవరణలో గ్రీనరీతో పాటు పెదకర్మ ఇతర కార్యక్రమాలు నిర్వహించే నిమిత్తం కొన్ని రోజుల పాటు అక్కడ ఉండేందుకు గదులు, భోజనశాల, వంటశాల, కేశ ఖండనం, స్నానపు గదులు, అస్థికలు భద్రపరిచే గదులు, వాటిక బయట రోడ్డు విస్తరణ, ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా అభివృద్ధికి చర్యలు తీసుకున్నామని వివరించారు. ఎలక్ట్రికల్ దహన యంత్రంతో పాటు అన్ని సౌకర్యాలతో అంతిమ సంస్కారాలు నిర్వహించడానికి ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పార్థివ దేహాల్ని భద్రపరచడానికి ప్రత్యేకంగా ఐస్ మార్చురీ గదులు, బాక్సులతో పాటు పలు దేవతామూర్తుల విగ్రహాల్ని కూడా ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నిమ్మల వెంకటరమణ, గేదెల నాగ రంగమణి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గులాం రసూల్, నగరపాలక సంస్థ డీఈఈ రమేష్‌బాబు పాల్గొన్నారు.

7 నుంచి శ్రీ లక్ష్మీతిరుపతమ్మ తిరునాళ్ల

పాత గుంటూరు: కొరిటెపాడు అంజనేయపేటలోని శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య ఆలయ తిరునాళ్ల మహోత్సవాలు ఈ నెల 7 నుంచి 11 వరకు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు కన్నసాని విజయ్ కుమార్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 7న ఉదయం 6 గంటలకు నెల పొంగళ్లు, విశేష పూజలు, సాయంత్రం 6 గంటలకు స్వామి ఊరేగింపు, 8న ఉదయం 8 గంటలకు గణపతి హోమం, అభిషేకాలు, 9న లక్ష్మీనారాయణ హోమం, విశేష పూజలు, 10న ఉదయం 7 గంటలకు చండీ హోమం, కుంకుమపూజ, 11న ఉదయం 11 గంటలకు అన్నదానం జరుగుతాయని వివరించారు.